పస్తులతో కుస్తీ

- అల్పాహారం అందక అలసిపోతున్న 'పది' విద్యార్థులు
- మధ్యాహ్న భోజనమే.. స్నాక్స్ లేదు
- స్టడీ అవర్స్, పునశ్చరణ పరీక్షల పేరుతో అధిక ఒత్తిడి

రాయదుర్గంటౌన్: ఇది పరీక్షల కాలం.. బాగా చదవాలంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.. వేళకు తినాలి.. త్వరగా నిద్రలేవాలి.. అని విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తు చేస్తుంటారు.. అయితే పబ్లిక్ పరీక్షల కోసం ప్రత్యేక తరగతుల పేరుతో ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరం 'పది'ంతల కసరత్తు చేయిస్తున్నారు. సాయంత్రం స్నాక్స్ లేకపోవడంతో విద్యార్థులు నీరసించిపోతున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని ఏ పాఠశాలలోనూ విద్యార్థులకు అల్పాహారం అందలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో అధికంగా పేద, మధ్య తరగతి విద్యార్థులే ఉంటారు. పదో తరతి పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం నుంచి సాయంత్రం దాకా స్టడీ అవర్స్, పరీక్షలు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 1 గంటకు తింటున్న భోజనం తప్ప...మరే ఆహారం లేకపోవడంతో సాయంత్రానికి విద్యార్థులు ఆకలితో అల్లాడిపోతున్నారు. కాలే కడుపుతో చదువుపై పూర్తి స్థాయిలో ఏకాగ్రత నిలుపులేకపోతున్నారు.

ఈ ఏడాది రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని 133 జెడ్పీ, ఉన్నత పాఠశాలల్లో మొత్తం 9,993 మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్, ప్రత్యేక తరగతులు, పరీక్షలు నిర్వహిస్తున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభంకానున్నాయి. పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణతతోపాటు ఉత్తమ ఫలితా సాధన కోసం ఉదయం, సాయంత్రం ఉపాధ్యాయులు వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 7.30 గంటలకే ఇళ్ల వద్ద బయల్దేరి 8 గంటలకు నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక తరగతులు, పరీక్షలతో సాయంత్రం 5.30 గంటల వరకు విద్యార్థులు పాఠశాలల్లోనే ఉండాల్సి వస్తుంది. ప్రత్యేక తరగతులు జరిగిన తర్వాత ఇళ్లకు చేరేందుకు సాయంత్రం 6 గంటలవుతోంది. ఇలాంటి తరుణంలో విద్యార్థులకు స్నాక్స్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాల్సి ఉంది. కానీ ప్రభుత్వం మాత్రం ఇదేమీ పట్టించుకోకపోవడంతో విద్యార్థులు సాయంత్రం దాకా నీరసించిపోతున్నారు. కొందరు ఉపాధ్యాయులు దాతల సహకారం కోసం ఎదురుచూస్తున్నారు. ఒక్కో పాఠశాలకు విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.వెయ్యి నుంచి రూ.1,500 దాకా ఖర్చు వస్తుంది.

దాతలు ముందుకు రావాలి...


బీజీ తిలక్ మున్సిపల్ హైస్కూల్‌లో పునశ్చరణ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అల్పాహారం ఇస్తే బాగుంటుంది



మంచి ఫలితాలు సాధించాలని స్టడీ అవర్స్, పరీక్షలతో ఉదయం నుంచి సాయంత్రం దాకా పాఠశాలల్లోనే ఉంటున్నాం. మధ్యాహ్న భోజనం తప్ప ఉదయం, సాయంత్రం ఎలాంటి స్నాక్స్ ఇవ్వడం లేదు. చాలాసార్లు విద్యార్థులు అలసిపోతున్నారు. దీంతో కొంతమంది ఇంటి నుంచి తెచ్చుకుంటున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వం టెన్త్ విద్యార్థులకు స్నాక్స్ ఏర్పాటు చేయాలి.
– దివ్యభారతి, టెన్త్ విద్యార్థిని, బీజీ తిలక్ మున్సిపల్ హైస్కూల్, రాయదుర్గం

దాతలు ప్రోత్సహించాలి



టెన్త్ విద్యార్థులకు అల్పాహారం కోసం ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులుండవు. దాతలు స్పందించి ఉదయం, సాయంత్రం టెన్త్ విద్యార్థులకు స్నాక్స్ అందించేందుకు ముందుకొచ్చి ప్రోత్సహిస్తే బాగుంటుంది. కొన్ని పాఠశాలల్లో వారానికి ఒకటి, రెండు సార్లు ఉపాధ్యాయులు సాయంత్రం వేళలో స్నాక్స్ అందిస్తున్నారు. – నాగమణి, ఎంఈఓ, రాయదుర్గం

వైభవంగా గురుసిద్ధావధూత రథోత్సవం


వెలిగొండలో గురుసిద్ధావధూత రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: మండలంలోని వెలిగొండలో వెలసిన గురుసిద్ధావధూత స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం అర్ధరాత్రి నుంచి వేడుకలు ప్రారంభమయ్యాయి. గంగనీటిని ఊరేగించారు. ఆలూరు గురుసిద్ధేశ్వరస్వామి జీవసమాధి నుంచి తెచ్చిన తీర్థం తీసుకొచ్చి అభిషేకించారు. స్వామికి విశేష పూజలు, అభిషేకాల అనంతరం గురుసిద్ధావధూతల రథోత్సవాన్ని శుక్రవారం తెల్లవారుజామున గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం తిరిగి ఆలయం వద్ద యథాస్థానానికి చేర్చారు.

పాడి పంటలు బాగా పండుతాయి:
ఆలయ ఆవరణలో శుక్రవారం వచ్చే ఏడాది రైతాంగానికి ఎలా ఉంటుందో కార్ణీకం సూచించారు. ఎర్ర, నల్లరేగడి భూముల్లో ఈఏడాది పంటలు బాగా పండుతాయన్నారు. రైతుకు గిట్టుబాట ధర వస్తుంది. పైరుకు పురుగుల బెడద వల్ల రైతులకు కొంతమేర నష్టం, కొన్ని చోట్ల అతివృష్టి, అనావృష్టి కలుగుతుందన్నారు.


గురుసిద్ధావధూత మూలవిరాట్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రాయదుర్గంటౌన్: సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అర్బన్ సీఐ జయానాయక్ తెలిపారు. శుక్రవారం ఆవులదట్లలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినులకు సైబర్ నేరాలు, సైబర్ వలంటీర్ రిజిస్ట్రేషన్, పోక్సో చట్టం, ఈవ్‌టీచింగ్ ఏ విధంగా ఎదుర్కోవాలనే, మహిళా చట్టాలు అనే అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని అనంతపురం ప్రధాన రహదారిపై వాహనాలు తనిఖీ చేసి, రోడ్డు నిబంధనలపై తెలియజేశారు.


ఆవులదట్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ జయానాయక్

గడ్డివాములకు నిప్పు

రాయదుర్గంటౌన్: మండలంలోని 75 వీరాపురంలో రైతు మల్లేష్‌కు చెందిన గడ్డివాములకు గురువారం అర్ధరాత్రి నిప్పంటుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాములకు నిప్పు పెట్టారని బాధితుడు తెలిపాడు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.

మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఉరవకొండ: ఉద్యోగ భద్రత కల్పించాలని మీటర్ రీడర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉరవకొండ విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయ ఆవరణలో ఈనెల 20న తలపెట్టిన విద్యుత్ మీటర్ రీడర్స్ ఛలో విజయవాడ పోస్టర్లను విడుదల చేశారు. యూనియన్ నాయకులు రమేష్‌బాబు, సబ్ డివిజన్ నాయకులు సత్యనారాయణ, బషీర్, పవన్, మల్లికార్జున, వీరేష్ మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా అతి తక్కువ కమీషన్‌తో విద్యుత్ మీటర్ రీడర్స్‌గా పని చేస్తున్నామన్నారు. కనీస వేతనం అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.


చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేస్తున్న మీటర్ రీడర్స్

పారిశుధ్య కార్మికులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

రాయదుర్గంటౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజారోగ్యాన్ని కాపాడే పారిశుధ్య కార్మికులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప పేర్కొన్నారు. శుక్రవారం రాయదుర్గం పురపాకల సంఘంలో పనిచేసే పారిశుధ్య కార్మికుల కోసం ఏరియా ఆస్పత్రిలో ఉచిత వైద్య చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఏరియా ఆస్పత్రి వైద్య బృందం కార్మికులను పరీక్షించి చికిత్సలు అందజేశారు. పొరాళ్ల శిల్ప మాట్లాడుతూ కార్మికులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఉమామహేశ్వర్, మోహన్‌సాయి, కౌన్సిలర్లు గౌని లావణ్య, ప్రశాంతి, శ్రీనివాసరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు నజీర్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, నిజాముద్దీన్, బషీర్ అహ్మద్, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేయిస్తున్న దృశ్యం

వైఎస్సార్‌సీపీ నేత జేసీబీ ధ్వంసంపై ఫిర్యాదు

కంబదూరు: మండలంలోని రాళ్ల అనంతపురం పంచాయతీ సర్పంచ్ మంగమ్మ భర్త వైఎస్సార్‌సీపీ నేత అమర్ జేసీబీ ధ్వంసంపై వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం ఎస్ఐ ప్రవీణ్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ అమర్ ఇంటి వద్ద ఉన్న జేసీబీని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారన్నారు. రూ.2లక్షల వరకు నష్టం జరిగిందన్నారు. గతంలోనూ వ్యవసాయ మోటారు కేబుల్ కూడా ఎత్తుకెళ్లారన్నారు. ప్రతి సారీ సర్పంచు కుటుంబాన్ని టార్గెట్ చేసుకొని ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారన్నారు. ఎస్ఐకు ఫిర్యాదు చేసిన వారిలో జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, యువజన నాయకుడు భీమేష్, మండల కన్వీనర్ కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, సర్పంచులు హరినాథ్, బాపూజీ తదితరులు ఉన్నారు.


ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, సర్పంచులు

దామోదరం సంజీవయ్య అందరికీ స్ఫూర్తి


దామోదరం సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం


దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అందరికీ స్ఫూర్తి అని ఎంపీపీ మారుతమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జయంతి నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు భట్టువానిపల్లి ఆంజనేయులు, ఏఓ శివశంకర్, ఈఓఆర్డీ రంగనాయకులు, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్, పంచాయితీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

కంబదూరు: దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయమైనవని జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, ఎంపీపీ తనయుడు వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు బీమేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కదిరిదేవరపల్లి హనుమంతరాయుడులు అన్నారు. దామోదరం సంజీవయ్య 104వ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఓ తిప్పయ్య, ఈఓపీఆర్డీ గూడెన్న, పంచాయతీ కార్యదర్శులు మహేష్, వీరశేఖర్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమాన్ని అధికారులు శుక్రవారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాంరావు అధికారులతో కలిసి దామోదరం సంజీవయ్య జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: నిజాయితీకి, నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనం దామోదరం సంజీవయ్య అని డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్‌డీ దాస్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ హనమంతప్ప, జూనియర్ అసిస్టెంట్ గౌరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అదనపు పీహెచ్‌సీని ఏర్పాటు చేయండి


కమిషనర్‌తో మాట్లాడుతున్న సర్పంచ్ లలితమ్మ

కూడేరు: మండలానికి అదనపు పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్‌ను సర్పంచ్ లలితమ్మ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని కమిషనర్‌తోపాటు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి సందర్శించారు. సర్పంచు మాట్లాడుతూ మండల జనాభా రోజురోజుకూ పెరుగుతోందని, అదనపు పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని కోరారు. గతేడాది కొర్రకోడు పీహెచ్‌సీ మంజూరయినా ఇంతవరకూ నిర్మాణ పనులు జరగలేదన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మరో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని కోరారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు


రాతిదూలాన్ని లాగుతున్న వృషభాలు

కుందుర్పి: మండలంలోని అపిలేపల్లిలోని బొబ్బర్లకుంట అంజనేయస్వామి రథోత్సవంలో భాగంగా శుక్రవారం జరిగిన రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన 13 జతల వృషభాలు రాతిదూలం లాగుడు పోటీల్లో పాల్గొన్నాయి. ఇందులో శ్రీసత్యసాయి జిల్లా తోపుదుర్తికి చెందిన చెన్నప్ప వృషభాలు ప్రథమ బహుమతి సాధించగా, మద్దలచెరువుకు చెందిన కొండన్న వృషభాలు రెండో బహుమతి, అనంతపురం రూరల్ సోమలదొడ్డికి చెందిన రామసుబ్బారెడ్డి వృషభాలు తృతీయ బహుమతి సాధించాయి. విజేతలకు సర్పంచ్ అతావుల్లా చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కేపీ రామాంజనేయులు, పెద్దప్పయ్య, సోమనాథ్, సర్పంచ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి

- గుంతకల్లు ఎంవీఐ రాజాబాబు


ఉరవకొండలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని గుంతకల్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజాబాబు, ఉరవకొండ ఎస్ఐ జనార్ధన్‌నాయుడు వాహనదారులకు సూచించారు. శుక్రవారం ఉరవకొండ క్లాక్ టవర్ వద్ద వాహనాదారులు, ఆటో డ్రైవర్లతో రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ చేశారు. గుంతకల్లు ఎంవీఐ, ఉరవకొండ ఎస్ఐ మాట్లాడారు. వాహనాలను అతివేగంగా నడిపితే ప్రాణాలు గాల్లో కలుస్తాయన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలన్నారు. ఆటో డ్రైవర్లు ఓవర్‌లోడ్ వేసుకోరాదన్నారు.

రేపటి నుంచి మంజునాథ స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ట

బొమ్మనహాళ్ (?)
బెళుగుప్ప: మండల కేంద్రంలోని మంజునాథ స్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ట నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ప్రతిష్టా హోమాలకు ప్రముఖ మళయాళ పండితులు కేరళ బ్రహ్మశ్రీ శ్రీరంగం సరున్మోహన్ తంత్రి ఆధ్వర్యంలో ధ్వజస్తంభ ప్రతిష్ట హోమాలు, పూజలు చేశారు. ఆదివారం అష్టద్రవ్య మహాగణపతి, వాస్తు హోమాలు, భగవతి పూజలు కొనసాగుతాయి. సోమవారం హోమాలు, నవగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట, పూర్ణాహుతి హోమాలను కేరళ పండుతుడు బ్రహ్మశ్రీ శ్రీరంగం సరున్మోహన్ తంత్రి నిర్వహించనున్నారు.

26 మందికి ఉద్యోగావకాశాలు


ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల అధ్యాపకులు, కంపెనీ ప్రతినిధులు

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డిగ్రీ కళాశాలలోని జేకేసీలు సంయుక్తంగా శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. డిగ్రీ, ఇంటర్, టెన్త్ అర్హత ఉన్న విద్యార్థులు నిరుద్యోగులకోసం జాబ్‌మేళా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన జాబ్ మేళాలలో 100 మంది పాల్గొనగా, గ్రీన్ టెక్ కంపెనీకి 17 మంది, లోకల్ సర్వీస్ మొబైల్ యాప్ కంపెనీకి 9 మంది ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని ప్రిన్సిపాల్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ అయ్యన్న, స్కిల్ డెవలప్‌మెంట్ సమన్వయకర్త జయలక్ష్మి నియామక పత్రాలు అందించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మస్తానప్ప, జేకేసీ సమన్వయకర్త నారాయణస్వామి, మెంటర్ నాగేంద్రగౌడ్, తెలుగు అధ్యాపకులు పరమేష్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కలశస్థాపన


ప్రత్యేక అలంకరణలో స్వామి

కణేకల్లు: మండల కేంద్రంలో శుక్రవారం శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి గుడిగోపుల కలశస్థాపన శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయంలో స్వామికి ప్రత్యేకపూజలు, హోమాలు నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నవగ్రహ హోమం, పురుష సూక్తం, శ్రీసూక్త హోమాలు నిర్వహించారు. అనంతరం కలుశానికి పూర్ణకుంభాభిషేకం నిర్వహించి, వేదమంత్రాలు పఠిస్తూ కలశాన్ని ప్రతిష్టించారు.

గజలక్ష్మి ఆలయంలో పూజలు


పూజలందుకున్న గజలక్ష్మిదేవి

రాయదుర్గం టౌన్: మల్లాపురం ఇందిరమ్మ కాలనీలో వెలసిన గజలక్ష్మి దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు చేసి,భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. పట్టణంలోని దుగ్గిలమ్మ ఆలయం, దండుమారెమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

మైలారలింగస్వామి విగ్రహ ప్రతిష్ట


ఆలయంలో హోమం చేస్తున్న పండితులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని అంబేడ్కర్ నగర్ క్రాస్–1లో వెలసిన పురాతన మైలారలింగస్వామి నూతన ఆలయం, విగ్రహ ప్రతిష్టలో భాగంగా శుక్రవారం నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరగనున్న కార్యక్రమాల్లో భాగంగా తొలిరోజు శుక్రవారం ఆలయంలో హోమం నిర్వహించారు. 15న శనివారం కలశాల ఊరేగింపు, 16న విగ్రహ ప్రతిష్ట, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరుగుతుంది.

బూదిగుమ్మ ఉత్సవాలు ప్రారంభం


బూదిగుమ్మ క్షేత్రంలో సీతారాముల కల్యాణోత్సవం

బెళుగుప్ప: మండలంలోని బూదిగుమ్మ క్షేత్రంలో రథోత్సవాల పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి సుప్రభాత సేవ, గణపతి, గోపూజ, రుద్రాభిషేకం, తులసి నామార్చన, పంచామృతాభిషేకాలు జరిగాయి. అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహమూర్తులకు కనులపండువుగా కల్యాణోత్సవం నిర్వహించారు. శనివారం ఉదయం గంగపూజ, గోపూజలతో అష్టోత్తర నామావళి, సహస్ర నామార్చన, మంత్రపుష్పం, హనుమాన్‌చాలీసా, ఉయ్యాలసేవ కార్యక్రమాలు కొనసాగుతాయి. అనంతరం ఆదివారం హనుమంతరాయస్వామి రథోత్సవం జరగనుంది.

బాలికలకు ఆత్మరక్షణ విద్య అవసరం


కేజీబీవీ విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో పద్మావతి

రాయదుర్గంటౌన్: బాలికలకు చదువుతోపాటు స్వీయ ఆత్మరక్షణ విద్య కూడా అవసరమని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పద్మావతి తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న రూపొందించిన ఆత్మరక్షణ విద్య– నైపుణ్యాలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని కేజీబీవీలో బాలికల చట్టాలు, హక్కులపై అవగాహన, కరాటే శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అంజనమ్మ, ఈశ్వరమ్మ, ఐసీపీఎస్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో గేదె దూడ మృతి

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామంలో గేదె దూడపై గురువారం అర్ధరాత్రి చిరుత దాడి చేసింది. రైతు గోపాల్‌రెడ్డి వ్యవసాయ తోటలో ఉన్న గేదె దూడపై చిరుత దాడి చేసింది.

మెలకువలు పాటిస్తే మేలైన దిగుబడి

- మామిడిలో పూత దశ కీలకం
- నియోజకవర్గంలో 18వేల ఎకరాల్లో సాగు
- కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రాయుడు




కళ్యాణదుర్గం:ప్రస్తుతం మామిడి పంట పూత దశకు వచ్చింది. ఈ సమయంలో దిగుబడి పెంచుకోవడానికి కొన్ని మెలకువలు పాటిస్తే గణనీయమైన లాభాలు సాధించొచ్చు. దీనిపై కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రాయుడు మామిడి రైతులకు శుక్రవారం పలు సలహాలు, సూచనలు తెలియజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 18 వేల ఎకరాల్లో మామిడి సాగు జరిగినట్లు ఆయన తెలిపారు. కొమ్మలకు పూత వచ్చే ప్రస్తుత సమయంలో వాతావరణ పరిస్థితులు, ఉష్ణోగ్రత తీవ్ర ప్రభావం చూపిస్తాయి. కొన్ని సమయాల్లో పూత వచ్చినప్పటికీ అది ముడుచుకొని పోయే ప్రమాదం ఉంది. సీజన్‌లో పూత పూర్తిగా రాకపోవడం కారణంగా నష్టం జరిగే అవకాశం ఉంది. దీనికి సంబంధించి నాప్తలిన్ అసిటిక్ ఆమ్లాన్ని స్పిరిట్‌లో కరిగించి, ఆ తర్వాత మంచినీటిలో కలిపి చెట్టు పూర్తిగా తడిచే విధంగా పిచికారీ చేయాలి. కొమ్మలకు పూత సాగి పూలు విచ్చుకొని పిందెకట్టే అవకాశం అధికంగా ఉంటుంది.


కళ్యాణదుర్గం వద్ద సాగు చేసిన మామిడి పంట

సాగునీటి యాజమాన్యం..
మామిడి పూత సమయంలో తోటలకు నీటి తడులు చాలా అవసరం. పూత,మొగ్గ బయట పడే సమయంలో మామిడి తోటలకు తప్పనిసరిగా నీటిని అందించాల్సి ఉంటుంది. వేళ్ల నుంచి చివర కొమ్మ వరకు తడి అందేలా చేస్తే అన్ని కొమ్మలకు పూత సాగే అవకాశం ఉంటుంది. నీటిని అందించే విషయంలో కూడా జాగ్రత్తలు పాటించాలి. పదహేనుళ్ల దాటని తోటలకు ఒక్కసారి బాగా తేలిక నేలలైతే వారం రోజుల తర్వాత మరోసారి సాగునీరు అందించాల్సి ఉంటుంది. లేదంటే డ్రిప్ ద్వారా వారం రోజుల పాటు నీరు అందిస్తే ప్రయోజనం ఉంటుంది.

మామిడి పిందె దశలో..
రబీలో ఆలస్యంగా కోతకు వచ్చే రకాల చెట్లుపై హార్మోనులను పిచికారీ చేస్తే పూత, పిందె రాలడం బాగా తగ్గుతుంది. తెల్లపూత, జొన్న గింజ, పరిమాణంలో పిందెలు ఉన్నప్పుడు 200 లీటర్ల నీటిలో 4 గ్రాముల నాఫ్తలీన్ అసిటిక్ ఆమ్లం, దీనికి తోడు 400 గ్రాముల బోరాన్ కలిపి పూతపై పడేలా పిచికారీ చేసుకోవడం వల్ల పిందెకట్టే సమయంలో రాలడాన్ని నివారించొచ్చు. కాయ దశ వరకు దీని ప్రభావం ఉంటుంది. ఈ సమయంలో పూతపై మాత్రమే తుంపర్లు పడే విధంగా జాగ్రత్తలు వహించడంతో పాటు పిందె పరిమాణం పెరుగుతన్న సమయంలో కూడా నీటిని అదించడం మొదళ్లలో తడి ఆరకుండా చూడాలి.

వాతావరణ మార్పులను తట్టుకుంటేనే..



మామిడి పిందె పరిమాణం నుంచి వాటి అభివృద్ధి సమయంలో పదిహేనేళ్లకు పైన ఉన్న చెట్లపై 500 గ్రాముల యూరియాతో పాటు 1–15 కిలోల పొటాషియం చొప్పున వేయాలి. దీంతో పిందె అభివృద్ధి చెంది వాతావరణ మార్పులను తట్టుకుంటుంది. ఇరవై ఏళ్లు దాటిన తోటల్లో నీటి సౌకర్యం విఘాతం కలిగినప్పుడు పిందె పరిమాణం బాగా పెరిగిన తర్వాత లీటరు నీటికి 100 గ్రాముల చొప్పున పొటాషియం నైట్రేట్ కలిపి 20 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేస్తే మేలు.
– డాక్టర్ చంద్రాయుడు, కేవీకే కో ఆర్డినేటర్